# గుట్టలో వైభవంగా నిత్యారాధనలు



లక్ష్మీనారసింహుల తిరు కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 18 : యాదగిరిగుట్ట ప్రధానాలయంలో లక్ష్మీనారసింహులకు నిత్యారాధనలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామిని మేల్కొల్పి తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం చేశారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. అనంతరం లక్ష్మీసమేతుడైన కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్టించి నిత్య కల్యాణ తంతు జరిపించారు. సాయంత్రం వేళలో స్వామి వారికి తిరువీధి, దర్బార్ సేవ ఘనంగా నిర్వహించారు. అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీలలితా అష్టోత్తరం, లలిత సహస్రనామార్చన, పారాయణం, జపాలు, కుంకుమార్చన నిర్వహించారు. లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.12,13,861 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత తెలిపారు.

## ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరించాలి

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- నార్కట్‌పల్లి, ఎల్లారెడ్డిగూడెం వార్డు మెంబర్లు బీఆర్‌ఎస్‌లో చేరిక



గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, అక్టోబర్ 18 : ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కార్యకర్తలకు సూచించారు. పట్టణ కేంద్రంలోని 6వ వార్డు మెంబర్ చేపూరి రాజు, ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఒకటో వార్డు మెంబర్ చిక్కుల్ల లింగస్వామితో పాటు మరికొందరు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పథకాలతో ఏదో రకంగా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతుందని అట్టి పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



### భక్తిశ్రద్ధలతో నవరాత్రోత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు బుధవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చింది. నేరేడుచర్ల పట్టణంలోని అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో దుర్గామాత మహాలక్ష్మి అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు దర్శించుకుని పులకించిపోయారు.

*– నేరేడుచర్ల, అక్టోబర్ 18*

## పురుషోత్తమాచార్యులకు జాతీయ పురస్కారం




రాష్ట్రపతి నుంచి జాతీయ సినీ విమర్శక పురస్కారం అందుకుంటున్న పురుషోత్తమాచార్యులు

రామగిరి, అక్టోబర్ 18 : నల్లగొండ జిల్లాకేంద్రానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, సంగీత విద్వాంసులు ఎం.పురుషోత్తమాచార్యులు ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి బుధవారం జాతీయ సినీ విమర్శక పురస్కారం అందుకున్నారు. తెలుగు సినీ సాహిత్య చరిత్రలో తెలంగాణ నుంచి ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్న తొలి వ్యక్తి పురుషోత్తమాచార్యులు కావడం జిల్లాకే గమనార్హం. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ పురస్కారం అందుకోవడంపై నల్లగొండ సాహితీవేత్తలు సాగర్ల సత్తయ్య, తండు కృష్ణకౌండిన్య, సిలివేరు లింగమూర్తి, లింగనబోయిన లేఖానంద స్వామి, ఆనంద్ హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలపై ప్రత్యేక నిఘా

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



డిజిటల్ లావాదేవీలపై అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, అక్టోబర్ 18 : సార్వత్రిక ఎన్నికల్లో ప్రలోభాలను అరికట్టేందుకు డిజిటల్ లావాదేవీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను అదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఆయన ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి ఇంటలిజెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీల పరిశీలనకు ఎస్‌బీఐ, కెనెరా, యూనియన్ బ్యాంక్ , ఏపీజీవీబీ సిబ్బందితో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బ్యాంక్ ఖాతాలో పెద్ద ఎత్తున నగదు డిపాజిట్ చేయడం కాని ఇతర ఖాతాలకు బదిలీ చేయడం జరిగిన వెంటనే వివరాలు జిల్లా ఎన్నికల అధికారికి తెలపాలన్నారు. వస్తు రవాణ పెద్ద మొత్తంలో జరిగితే వెంటనే తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐటీ అధికారులు అనుమానిత ప్రాంతాల్లో తనిఖీ చేయాలని సూచించారు. జిల్లాలో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వీటిలో పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, ఫారెస్ట్, అధికారులు 24గంటల పాటు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రియాంక, వెంకట్‌రెడ్డి, ఎస్పీ నాగేశ్వర్‌రావులతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్బన్ కాలనీ ప్రజలకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

## సర్కారుకు మద్దతుగానే బీఆర్‌ఎస్‌లోకి వలసలు

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, అక్టోబర్ 18 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు నచ్చి బీఆర్‌ఎస్‌లో వలసలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెంచికల్‌పహాడ్ గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు పట్టణ పరిధిలోని ఓ హోటల్లో ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదల కడుపునింపేలా ఉన్నాయన్నారు. అట్టడుగు వర్గాలు అభివృద్ధి చెందాలనే కోణంలో సీఎం కేసీఆర్ ఊహకందని పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ప్రతీ కుటుంబానికి సీఎం కేసీఆర్ బీమా కల్పించడంతో ఎంతో ధీమా ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతిపక్షాలకు దిమ్మతిరిగేలా ఉన్నాయన్నారు. పేదల సంక్షేమానికి అనునిత్యం పాటుపడుతున్న సీఎం కేసీఆర్ వెంటే ప్రజలు ఉంటారన్నారు. ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, మండలాధ్యక్షుడు జనగాం పాండు, ప్రధాన కార్యదర్శి నీలం ఓంప్రకాశ్‌గౌడ్, నాయకులు సిలువేరు యేసు, జడల యశీల్‌గౌడ్, సిలువేరు మధు, సందీప్ పాల్గొన్నారు.

### రోడ్డు సమస్య తీర్చిండని బీఆర్‌ఎస్‌లో చేరిక

భువనగిరి అర్బన్ : ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి రోడ్డు మార్గం ఏర్పాటుతో పట్టణంలో అర్బన్‌కాలనీ ప్రజల ఏండ్ల నాటి సమస్య తీరింది. దీనికి కృతజ్ఞతగా అర్బన్ కాలనీ ప్రజలు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ అర్బన్ కాలనీ మరింత అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో మూడోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొల్పుల అమరేందర్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఏవీ.కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కుశంగల రాజు, జాంగీర్, కడారి వినోద్, ఇట్టబోయిన గోపాల్, నాకోటి నగేశ్, పట్టణ యూత్ అధ్యక్షుడు నితీశ్, ప్రధాన కార్యదర్శి సూరజ్, యువకులు శివ, అజయ్, రాహుల్, శ్రీను, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే అంధకారమే

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



యాదగిరిగుట్ట పట్టణంలో గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, అక్టోబర్ 18 : కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే 24గంటల కరెంట్ పోయి అంధకారమే మిగులుతుందని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. ఓటర్లు ఆలోచించి కారు గుర్తుకు ఓటేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని నివాసంలో బుధవారం ఆయన సమక్షంలో మండలంలోని ధర్మారెడ్డిగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీను, పార్టీ సీనియర్ నాయకులు దాసి సిద్దులు, కొమ్ము కరుణాకర్, గవ్వల బీరుమల్లయ్య, శ్రీకాంత్, శివరాత్రి మహేశ్‌తో పాటు 150 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గం మొత్తం గులాబీమయంగా మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వరదలా వస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ విడుదల చేసిన మ్యానిఫెస్టోను చూసి ఆలోచన చేయాలన్నారు. మూడోసారి సీఎం కేసీఆర్ అధికారంలోకొస్తేనే ప్రభుత్వ పథకాలు కొనసాగుతాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ వస్తే రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, రైతుబంధు, రైతు బీమా పథకాలు నిలిచిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నాగపురి కిషన్, సర్పంచ్ సరిత, మాజీ సర్పంచ్ స్వర్గం నరహరి, గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు బెదరబోయిన రవి, పాల సంఘం చైర్మన్ జంగిటి అడివయ్య, మాజీ చైర్మన్లు జోగు అయిలయ్య, మగ్గం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### రాజాపేట నుంచి..

రాజాపేట మండలంలోని బేగంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కురుమ సంఘం నాయకులు గోనే స్వామి, అశోక్, కర్ణాకర్, స్వామి, బాలవ్వతో పాటు 100మంది యాదగిరిగుట్ట పట్టణంలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జెల్ల భిక్షపతి, జాల సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.